ప్రజాశక్తి
గురువారం 17 ఏప్రిల్ 2025
5
పార్వతీపురం మన్యం

## పాలకొండ కమిషనర్‌గా రత్నరాజు

ప్రజాశక్తి-పాలకొండ

పాలకొండ నగర పంచాయతీ కమిషనర్‌గా ఎస్‌జెవి రత్నరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నగర పంచాయతీ ఛైర్మన్ పల్లా ప్రతాప్, సమన్వయకర్త పల్లా కొండలరావును మర్యాద పూర్వకంగా కలిశారు. నగర పంచాయతీ అభివృద్ధి బాట పట్టాలని కొండలరావు.. కమిషనర్‌ను కోరారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న కమిషనర్

భద్రగిరి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

# వీడని విష జ్వరాలు

## మన్యంలో రోజురోజుకూ పెరుగుతున్న రోగుల సంఖ్య

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం మన్యంలో విష జ్వరాలు వీడటం లేదు. విద్యార్థుల నుంచి పెద్దల వరకు జ్వరాల బారిన పడుతున్నారు. సమీపంలోని ఆస్పత్రులకు వెళ్లి చికిత్స పొందుతున్నారు. వేసవి ఉష్ణోగ్రతలు అత్యధిక స్థాయిలో ఉండడంతో చిన్నారులు, వృద్ధులపై ప్రభావం చూపుతున్నాయి. వైరల్ జ్వరాలు, టైఫాయిడ్, కాళ్ల పీకులు, తలనొప్పి వంటి లక్షణాలతో గిరిజనులు బాధపడుతూ ఆస్పత్రుల్లో చేరుతున్నారు. భద్రగిరిలో రోజువారి ఒపి 200 వరకు నమోదు అవుతుంది. ఏజెన్సీకి కేంద్ర బిందువుగా ఉన్న భద్రగిరి ప్రభుత్వ ఆస్పత్రి 50 పడకలుగా రూపాంతరం చెందినా, రోగులకు 35 మంచాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఇవి ఎటూ చాలని పరిస్థితి. రోగులు పెరుగుతున్న కొద్దీ ఒక్కొక్క మంచంపై ఇద్దరు, ముగ్గురికి వైద్యం అందిస్తున్నారు. సీరియస్ కేసులు వస్తే పార్వతీపురం, విజయనగరం, విశాఖపట్నం వంటి దూరప్రాంతాలకు రిఫర్ చేస్తున్నారు. ఆస్పత్రిలో 12 మంది వైద్యులు ఉండాలి. కానీ, ఐదుగురు మాత్రమే ఉన్నారు. ఆస్పత్రి సమీపంలోని రూ.9.90 కోట్లతో నూతనంగా వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. భవన నిర్మాణం పూర్తయితే మెరుగైన, అన్ని రకాల సేవలు అందించడానికి వీలుంటుంది. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేసి సేవలు అందించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ఆస్పత్రిలో గదులు చాలక వరండాలోనే ఏర్పాటుచేసిన మంచాలు

నిర్మాణంలో ఉన్న వంద పడకల ఆస్పత్రి భవనం

# సాంకేతిక విద్యకు సమస్యలే అడ్డంకి

- ఏడేళ్లుగా పూర్తికాని రెండో అంతస్తు భవనం పనులు
- మంజూరు కాని లెక్చరర్ పోస్టులు.. డెప్యుటేషన్‌పై కొనసాగింపు
- ఇదీ జిఎంఆర్ పాలిటెక్నికల్ కళాశాల పరిస్థితి

*'గిరిజన విద్య కోసం రూ.కోట్లు కుమ్మరిస్తున్నాం. కెజి నుంచి పిజి వరకు అంతా ప్రభుత్వమే చదివిస్తుంద'ంటూ మన పాలకులు గొప్పలు చెబుతున్నారు. ఆచరణకొచ్చే సరికి మచ్చుకైనా అవేవీ కనిపించడం లేదు. 11 ఏళ్లుగా సీతంపేట జిఎంఆర్ పాలిటెక్నికల్ కళాశాలకు లెక్చరర్ పోస్టులు మంజూరుకాక, సరైన సదుపాయాలు లేక విద్యార్థులు మొగ్గు చూపడం లేదు. బోధకులు, ల్యాబులు లేక సమస్యల సుడిగుండంలో చిక్కుకుంది. బోధకులు, బోధనేతర సిబ్బంది అంతా డెప్యుటేషన్‌పై నడిపిస్తున్నారు.*

ప్రజాశక్తి-సీతంపేట

పదో తరగతి పూర్తయ్యాక పాలిటెక్నికల్‌లో చేరే వారి ప్రతి ఏటా పెరుగుతూ వస్తోంది. పాలిటెక్నిక్‌లో చేరేందుకు విద్యార్థులు శిక్షణ సైతం పొందుతున్నారు. ఇదివరకే దరఖాస్తులూ చేసుకున్నారు. ఈ నెల 30న పాలీసెట్ ప్రవేశ పరీక్ష రాయడానికి విద్యార్థులు సిద్ధమవుతున్నారు. జులై మొదటి వారంలో పాలిటెక్నికల్ కౌన్సిలింగ్, రెండో వారంలోనే తరగతులు ప్రారంభం కానున్నాయి. ఈ తరుణంలో పాలిటెక్నికల్ కళాశాలను అన్ని సదుపాయాలతో తీర్చిదిద్ది ఉండాల్సి ఉంది. కానీ, సీతంపేటలోని జిఎంఆర్ గవర్నమెంట్ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నికల్ కళాశాల అందుకు భిన్నంగా ఉంది. 2014 పాలిటెక్నికల్ కళాశాల ఏర్పాటు చేశారు. సీతంపేట ఐటిడిఎ సమీపంలో పాత భవనాల్లో పాలిటెక్నికల్ కళాశాలను 2018 వరకు నడిపించారు. ఆ తర్వాత మండల కేంద్రంలో నౌగూడ సమీపంలో రెండంతస్తుల భవనం నిర్మించారు. ఇప్పటికీ రెండో అంతస్తు భవనం ఫ్లోరింగ్, విద్యుత్తు పనులు పూర్తికాలేదు. దీంతో ఏడేళ్లుగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

జిఎంఆర్ పాలిటెక్నికల్ కళాశాలలో డిప్లొమా ఇన్ మెకానికల్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ సివిల్ ఇంజినీరింగ్ రెండు కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఒక్కొక్క కోర్సుకు 54 సీట్లు చొప్పున రెండు కోర్సులకు 108 సీట్లు కేటాయించారు. ప్రస్తుతం 47 మంది విద్యార్థులు ఇక్కడ పాలిటెక్నికల్ విద్యనభ్యసిస్తున్నారు. ఈ కళాశాలలో చదివిన విద్యార్థులకు రెసిడెన్షియల్ సదుపాయం కూడా కల్పించారు. గిరిజన విద్యార్థులకు 75 శాతం, ఇతర విద్యార్థులకు 25 శాతం అవకాశం కల్పించారు. అంతవరకు బాగానే ఉంది.

**వేధిస్తున్న బోధకుల కొరత**

మెకానికల్ ఇంజినీరింగ్‌కి నలుగురు లెక్చరర్లు ఉండాలి. ముగ్గురు డెప్యుటేషన్‌పై కొనసాగుతున్నారు. సివిల్ ఇంజినీరింగ్‌కి నలుగురు బోధకులు ఉండాలి. ఇద్దరితోనే, అది కూడా డెప్యుటేషన్‌పైనే నెట్టుకొస్తున్నారు. పాలిటెక్నికల్ మొదటి సంవత్సరంలో ఇంగ్లీష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ సబ్జెక్టులు ఉంటాయి. ఈ సబ్జెక్టులను సిఆర్‌టిలు శ్రీకాకుళం జిల్లా టెక్కలి పాలిటెక్నికల్ కళాశాలలో మూడు రోజులు, సీతంపేట పాలిటెక్నికల్ కళాశాలలో మూడు రోజులు బోధిస్తారు. ప్రస్తుతం ప్రిన్సిపల్ బివిఎస్‌ఎన్ మూర్తి డెప్యుటేషన్‌పైనే ఒఎస్‌డిగా కొనసాగుతున్నారు. కళాశాల మంజూరు చేసి 11 ఏళ్లు గడుస్తున్నా పోస్టులు మంజూరు కాకపోవడం గమనార్హం. ఇక బోధనేతర సిబ్బంది గురించి చెప్పనవసరం లేదు. కార్యాలయ సిబ్బంది అంతా అవుట్ సోర్సింగ్, డెప్యుటేషన్‌పై కొనసాగుతున్నారు.

### మరిన్ని సమస్యలు

- కళాశాలలో కొన్ని ల్యాబులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. హైడ్రాలిక్స్, థర్మల్, మెటీరియల్ టెస్టింగ్ ల్యాబులు లేకపోవడంతో శ్రీకాకుళం పాలిటెక్నికల్ కళాశాలకు ఇక్కడ విద్యార్థులను తీసుకెళ్లి, ప్రయోగాలు చేయిస్తుంటారు .
- కళాశాల చుట్టూ అడవి ఉన్నప్పటికీ ప్రహరీ లేదు. దీంతో ఎప్పుడు విషకీటకాలు, జంతువులు వస్తాయోనని విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. మైదానం ఉన్నప్పటికీ నిధులు లేక చదును చేయక క్రీడలను విద్యార్థులు సాధన చేయడం లేదు.
- కళాశాలలో రెండు నెలలుగా డైట్ బిల్లు అందలేదు. అదేవిధంగా అవుట్ సోర్సింగ్ సిబ్బందికి రెండు నెలలుగా జీతాలు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

### పాలిటెక్నిక్ చదివితే ఉద్యోగానికి భరోసా

పాలిటెక్నికల్ కళాశాలలో చదివిన వారికి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ భరోసా కల్పిస్తుంది. గత ఏడాది మా కళాశాలలో శత శాతం ఉత్తీర్ణత సాధించాం ఫైనల్ ఇయర్ మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారికి చెన్నైలో రాయల్ ఎన్‌ఫీల్డ్ కంపెనీలో ఉద్యోగావకాశాలు కల్పించాం. విద్యార్థుల ప్రవేశాలపైన దృష్టి పెట్టాం. అన్ని సదుపాయాలు కల్పిస్తే మరింత ఉత్సాహంతో పని చేస్తాం.

- బివి ఎస్‌ఎన్ మూర్తి, ప్రిన్సిపల్, జిఎంఆర్ పాలిటెక్నికల్ కళాశాల సీతంపేట

# గర్భిణుల హాస్టల్లో తనిఖీలు

ప్రజాశక్తి-సాలూరు

గిరిశిఖర గ్రామాల గర్భిణుల వసతిగృహాన్ని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారులు టి.జగన్మోహనరావు, పిఎల్.రఘుకుమార్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. విధుల్లో ఉన్న సిబ్బంది, హాజరు నమోదు పరిశీలించారు. ప్రస్తుతం వసతిగృహ కేంద్రంలో ఉన్న గర్భిణులు, ఏ ప్రాంతాల నుండి చేరారన్న వివరాలపై ఆరా తీశారు. వారి ఆరోగ్య స్థితి వివరాలు ఎంసిపి కార్డుల్లో పరిశీలించారు. గర్భిణులతో మాట్లాడి అక్కడ అందుతున్న సేవలు, పౌష్టికాహారం,వ 
మౌలిక సదుపాయాలపై అడిగి తెలుసుకున్నారు. గర్భిణులకు ప్రతిరోజూ ఐరన్, కాల్షియం మాత్రలు అందించాలన్నారు. తాగు నీరు స్వచ్ఛత పరీక్షలు నిర్వహించాలని అక్కడ సిబ్బందికి, యాజమాన్యానికి సూచించారు. టాయిలెట్ల నిర్వహణ, పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఏ సమస్య తలెత్తినా వెంటనే పట్టణంలో ఉన్న ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకెళ్లాలని ఆదేశించారు. వాహనం పనితీరుపై ఆరా తీసి పరిశీలించారు.

గర్భిణులతో మాట్లాడుతున్న డిపిఒలు

# గిరిజన చట్టాల నిర్వీర్యానికి కుట్ర

## సాగుభూములకు పట్టాలివ్వాలి : సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు

ప్రజాశక్తి-పాచిపెంట

గిరిజనులకు, వారి భూములకు రక్షణగా నిలుస్తున్న చట్టాలను కేంద్రంలోని మోడీ కుట్ర నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతోందని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు ఆగ్రహం వ్యక్తంచేశారు. మండలంలోని సరాయివలస జంక్షన్‌లో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు మజ్జి కృష్ణమూర్తి అధ్యక్షతన గిరిజన చట్టాలు-కాలరాస్తున్న పాలకులు అనే అంశంపై సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో నేటికీ డోలిమోతలు తప్పడం లేదని, పూర్తిస్థాయిలో రహదాల నిర్మాణం చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. తాగునీటి సమస్య నిత్యకృత్యమైందని, మౌలిక సదుపాయాలు, ఇల్లు నిర్మాణాలు, తదితర ఇబ్బందులు వెంటాడుతూనే ఉన్నాయని చెప్పారు. ఈ సమస్యల పరిష్కారం పాలకులకు పట్టడం లేదని విమర్శించారు. మరోవైపు పోరాడి సాధించుకున్న చట్టాలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుంటే, అందుకు రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం సహకరిస్తోందని మండిపడ్డారు. అందుకే నాన్ షెడ్యూల్డ్ గ్రామాలను షెడ్యూల్డ్ ఏరియాలో చేర్చడం లేదని, పీసా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయలేదని వివరించారు. దీని కారణంగా సాలూరు, మక్కువ, పాచిపెంట మండలాలతో పాటు మన్యం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో భూములు అన్యాక్రాంతమ వుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. మొన్న జరిగిన రీసర్వేలో ఈ విషయం తేటతెల్లమైందన్నారు. ప్రభుత్వ, డి-పట్టా భూములను కూడా కాజేస్తున్నారని, దీనిపై సమగ్ర సర్వేలు చేపట్టి, గిరిజనులకు భూములు పంపిణీ చేయాలని డిమాండ్‌చేశారు. కుడుమూరులో తాతల కాలం నుంచి సర్వే నంబర్ 48లోని 782 ఎకరాలను సాగు చేస్తున్న గిరిజనులకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. దీనిపై ఏళ్ల తరబడి పోరాటం చేస్తున్నా పాలకులు పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. గిరిజనులు హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్‌వై నాయుడు మాట్లాడుతూ జిసిసి ద్వారా గిరిజనుల పండించిన అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేయకపోవడం వల్ల దళారుల బారిన పడి తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. జిసిసిని సమర్ధవంతంగా నడిపించే బాధ్యతను ప్రభుత్వం తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సుర్రు రామారావు, గిరిజన సంఘం నాయకులు పెదరామయ్య, చింత రాంబాబు, కొట్టిస శంకర్రావు, కె.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు

## నీటి ఎద్దడిపై చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-కొమరాడ

మండలంలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో కొళాయిల వద్ద ఖాళీ బిందెలతో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 రోజులుగా మోటార్ మరమ్మతుకు గురైనా అధికారులు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో దళిత కుటుంబాలు నాగావళి నది నుంచి కలుషిత నీరు తెచ్చుకొంటున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే మోటారు బాగు చేసి కొళాయి ద్వారా తాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

## 21న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి -భామిని

ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశ పరీక్షను ఈ నెల 21న నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఆర్.శివకుమార్ తెలిపారు. 100 సీట్లకు గాను 229 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. మోడల్ స్కూల్ అధికారిక వెబ్‌సైట్ apms.apcfss.in ద్వారా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రానికి ఉదయం 8 గంటలకు చేరుకోవాలని, ఏమైనా సందేహాలు ఉంటే 9440322964, 9542078996 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

# దళితుల భూఆక్రమణపై విచారణ తప్పా?

## గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-సాలూరు

పాచిపెంట మండలం మోసూరు సర్పంచ్ దళితుల భూములను ఆక్రమించారని ఫిర్యాదు వస్తే విచారణ చేపట్టడం తప్పెలా అవుతుందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ప్రశ్నించారు. బుధవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మోసూరు సర్పంచ్ దళితుడైనంత మాత్రాన దళితులకు అన్యాయం చేస్తుంటే ప్రశ్నించడం తప్పు కాదన్నారు. సర్పంచ్ ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపట్టారని చెప్పారు. దీనిపై విచారణ జరిపితే తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. కరాసువలస కస్తూరిబా పాఠశాలని తాను ఆకస్మిక తనిఖీ చేసినప్పుడు ఓ విద్యార్థిని కడుపు కాలిపోతోందని చెప్పినట్లు తెలిపారు. విద్యార్థినుల ఆకలి తీర్చే విధంగా భోజనం పెట్టకపోతే విచారణ జరిపించాలని ఆదేశించానని చెప్పారు. వారిలో 50మందికి పైగా గిరిజన విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో విచారణ జరిపించాలని ఆదేశిస్తే తప్పు ఎలా అవుతుందని అన్నారు. ఇలాంటి తప్పులు రాజారెడ్డి రాజ్యాంగంలో సాధ్యమవుతుందేమో కానీ అంబేద్కర్ రాజ్యాంగంలో సాధ్యం కాదన్నారు. మున్ముందు కూడా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేస్తానని, తప్పు జరిగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. తాను మంత్రిగా ఏ అధికారినీ నాలుగైదు గంటలు నిరీక్షించేలా చేయలేదని మాజీ మంత్రి రాజన్నదొరని ఉద్దేశించి వ్యంగ్యంగా అన్నారు. తిరుపతి దర్శనం టిక్కెట్లు అమ్ముకునే అలవాటు తనకు మాజీ మంత్రి పుష్పశ్రీవాణిని ఉద్దేశించి మాట్లాడారు. వైసిపి అబద్ధపు ప్రచారాలతో ప్రజల్ని గందరగోళంలో పెట్టాలని చూస్తోందని, మత రాజకీయాలను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. తిరుమలలో గోవుల హత్య జరిగిందని అసత్య ప్రచారం చేయడం దారుణమని మంత్రి సంధ్యారాణి చెప్పారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు నిమ్మాది తిరుపతిరావు, గుల్ల వేణుగోపాల్ నాయుడు, ఆముదాల పరమేష్, ఎఎంసి ఛైర్మన్ ముఖి సూర్యనారాయణ పాల్గొన్నారు.

# చిట్టిగెడ్డ ఆక్రమణలు తొలగించాలని ధర్నా

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

పార్వతీపురం మండలం తాళ్లబురిడి గ్రామంలో సాగునీరు అందించే చిట్టిగెడ్డలో ఆక్రమణలను తొలగించాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి అధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎపి రైతుసంఘం ఆధ్వర్యాన రైతులు ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాళ్లబురిడి సాయిగడ్డపై అడ్డుకట్ట వేసి చిట్టిగెడ్డ ద్వారా లచ్చరాజుపేట, బందలుప్పి, పులిగుమ్మి గ్రామాలకు చెందిన రైతులు సుమారు 300 ఎకరాలలో సాగుచేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ భూమి గుండా వెళ్తున్న ఈ గెడ్డను గ్రామానికి చెందిన మాజీ విఆర్‌ఒ ఒకరు ఆక్రమించుకొని, గెడ్డకు చెందిన బట్టిని కప్పేసి రైతుల పొట్ట కొట్టారని అన్నారు. తరతరాలుగా రైతులు ఉపయోగించుకుంటున్న ఈ కాలువను కప్పేయడం చట్ట విరుద్ధమైన చర్యని, ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. తక్షణమే చిట్టిగెడ్డపై ఉన్న ఆక్రమణలన్నీ తొలగించి రైతులకు సాగునీరు ఇవ్వాలని కోరారు. సాకిగెడ్డపై చెక్‌డ్యామ్ నిర్మించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు బంటు దాసు, రైతులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న ఎపి రైతుసంఘం నాయకులు, రైతులు

# ఇడి చర్య.. కేంద్రం కక్ష సాధింపే

## కాంగ్రెస్ ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

కాంగ్రెస్ పార్టీ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీపై ఇడి కేసు నమోదు చేయడం.. కేంద్రం కక్ష సాధింపు రాజకీయానికి పాల్పడటమేనని ఆ పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. కేంద్ర ప్రభుత్వం రాజకీయ కక్షలను, ప్రతీకార చర్యలను విడనాడాలని కోరుతూ బుధవారం కలెక్టర్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై బురదజల్లేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర రాజకీయాలకు తెరలేపిందని వారు మండిపడ్డారు. తొలుత కలెక్టరేట్ వరకు ర్యాలీగా చేరుకున్నారు. అనంతరం డిఆర్‌ఒ హేమలతకు వినతి అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బత్తిన మోహన్ రావు, వంగల దాలినాయుడు, గేదెల రామకృష్ణ, సిరిసిపిల్లి సాయి శ్రీనివాస్, తీళ్ల గౌరీ శంకరరావు, మామిడి చంద్ర కుమార్, తదితరులు, తదితరులు పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న కాంగ్రెస్ నాయకులు

విలేకరులు కావలెను
ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు ఈ క్రింది కేంద్రాల్లో ఆసక్తి గల విలేకరులు కావలెను
అర్హత : ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజంపై ఆసక్తి, సమస్యలపై అవగాహన
-: విలేకరులు కావాల్సిన ప్రాంతాలు :-
విజయనగరం, గరివిడి, సంతకవిటి, సాలూరు
జియ్యమ్మవలస, గజపతినగరం రూరల్
కొత్తవలసరూరల్, పాలకొండ రూరల్
ఇంటర్వ్యూ : తేది: 18-04-24 శుక్రవారం ఉదయం 10 గంటలకు
సంప్రదించాల్సిన ఫోన్ నెంబరు : 9490099164, 9490099156, 8331011960
ప్రజాశక్తి కార్యాలయం
అశోక్ బంగ్లా ఎదురుగా, ఆర్ అండ్ బి జంక్షన్, విజయనగరం

హెచ్ఎంకు మెటీరియల్ అందజేస్తున్న గాంధీ ఆస్పత్రి ఎమ్‌డి మురళీకృష్ణ

## పాఠశాలకు వితరణ

**ప్రజాశక్తి - కురుపాం**

కురుపాం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు విశాఖపట్నానికి చెందిన మహాత్మా గాంధీ కేన్సర్ ఆస్పత్రి సిబ్బంది సిఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా రూ.2 లక్షలు విలువైన సామగ్రిని అందజేశారు. బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.శంకరరావుకు వాటర్ కూలర్లు, లైబ్రరీ రాక్స్‌ను ఆస్పత్రి ఎమ్‌డి వూన మురళీకృష్ణ అందజేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ గతంలో ఇన్వెర్టర్, కంప్యూటర్ అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ బెహరా దివాకరేశ్వర రావు, ఉపాధ్యాయులు ఆకుల జగదీశ్వర రావు, బరాటం లక్ష్మి ప్రకాశ్ పాల్గొన్నారు.

## అనసభద్ర వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని వినతి

**ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్**

అనసభద్ర ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ వార్డెన్ సురేష్‌ని సస్పెండ్ చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్.. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు బుధవారం ఫిర్యాదుచేశారు. మక్కువ మండలం అనసభద్ర ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్లో ఆదివారం రాత్రి ఆరోగ్య కార్యకర్త దుస్తులు పోవడం వల్ల విద్యార్థులను బాధ్యులను చేస్తూ కొట్టడం దారుణమని తెలిపారు. విద్యార్థులు తల్లిదండ్రులకు ఎటువంటి సమాచారం ఇచ్చినా టిసి ఇచ్చేస్తామన్న వార్డెన్ బెదిరింపులకు దిగుతున్నారని చెప్పారు. తక్షణమే విద్యాశాఖ అధికారులతో సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## గుమ్మలక్ష్మీపురం విఆర్ఒగా భాస్కరరావు

**ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం**

గుమ్మలక్ష్మీపురం విఆర్ఒగా గేదెల భాస్కరరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన రాయగడ జమ్మూ పంచాయతీ విఆర్ఒగా పని చేస్తూ ఇక్కడకు వచ్చారు.

## పార్టీ అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

**ప్రజాశక్తి-పాలకొండ**

టిడిపి అభివృద్ధికి ప్రతి కార్యకర్తా దృష్టి పెట్టాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పడాల భూదేవి కోరారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో మరింత బలంగా పనిచేయాలన్నారు. గ్రామ, బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్‌ఛార్జులు బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో ఎఎంసి డైరెక్టర్లు మోహన్ రావు, మంగయ్య, మండల రాంబాబు, మజ్జి జయశంకర్, ఎస్.సర్వారావు, ఆకుల కుమార్, గణేష్ పాల్గొన్నారు.

## కస్పావీధిలో వైద్య శిబిరం

**ప్రజాశక్తి-వీరఘట్టం**

వీరఘట్టంలోని రెండో సచివాలయ పరిధిలోని కస్పా వీధిలో బుధవారం వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులతోపాటు మధుమేహం, రక్తపోటు, తదితర రకాలైన రోగులకు పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

**ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్**

అగ్నిమాపక వారోత్సవాలు సందర్భంగా బుధవారం చినబొండపల్లిలో పార్వతీపురం అగ్నిమాపక అధికారి ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు, వాటి నివారణ కోసం చేపట్టాల్సిన చర్యలపై వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గండి శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

## నవధాన్యాల కిట్లు పంపిణీ

**ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్**

మండలంలోని చినబొండపల్లిలో ప్రకృతి వ్యవసాయ ఇన్‌ఛార్జి ఆధ్వర్యాన సర్పంచి గండి శంకరరావు రైతులకు నవధాన్యాల కిట్లు పంపిణీ చేశారు. ప్రధాన పంటను వేసుకునేందుకు నెల రోజులు ముందుగా నవధాన్య విత్తనాలను పొలంలో చల్లుకుని, అవి మొలకెత్తిన తర్వాత కలయ దున్నితే భూసారం పెరుగుతుందని రైతులకు వివరించారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ

**ప్రజాశక్తి-వీరఘట్టం**

ప్రకృతి వ్యవసాయం చేయాలని బుధవారం మండలంలోని విక్రంపురం గ్రామంలో డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ మాచర్ల నందీశ్వరరావు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. నవధాన్యాలు సాగు చేయటం వల్ల భూసారం పెరగడంతో పాటు పంట దిగుబడి కూడా వస్తుందని నందీశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో ఎపిసిఎన్ఎఫ్ మారుతి సింహాచలం, రైతులు పాల్గొన్నారు.

## అందరి సహకారంతో గ్రామాభివృద్ధి

**ప్రజాశక్తి -గరుగుబిల్లి**

అందరి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామని పెద్దూరు ఉపసర్పంచ్ టి.ఎల్లంనాయుడు తెలిపారు. పెద్దూరు పంచాయతీ కార్యదర్శి బంటు అప్పారావు ఆధ్వర్యంలో బుధవారం గ్రామసభను నిర్వహించారు. సమావేశంలో గరుగుబిల్లి పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు బి.వి.దామోదరరావు, మర్రాపు శ్రీనివాసరావు, గొంగాడ తిరుపతిరావు, బొబ్బిలి పెదబాబు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణులకు సీమంతాలు

**ప్రజాశక్తి -గరుగుబిల్లి**

మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రం-2లో బుధవారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కొమరాడ ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి గొట్టాపు సుగుణకుమారి, పెదగుడబ సెక్టార్ సూపర్వైజర్ రౌతు లక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో అంగన్వాడీలు పి.కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభానికి నోచుకోని పశువైద్యశాల

**ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం**

ప్రారంభానికి నోచుకోని పశు వైద్యశాల నూతన భవనం

గుమ్మలక్ష్మీపురంలో నూతనంగా నిర్మించిన పశు వైద్యశాల భవనం ప్రారంభానికి నోచుకోలేదు. ఈ భవనం నిర్మించి ఏడాది గడిచినా ప్రారంభించక పోవడంతో పాదలు మాటున నిరుపయోగమైంది. ప్రస్తుతం పశువైద్యశాల విధులు పాత తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. ఈ భవనం పూర్తిగా శిథిలమైంది. తలుపులు, కిటికీలు పాడయ్యాయి. సిబ్బంది విధులకు ఇబ్బందిగా మారింది. అధికారులు వెంటనే దృష్టి సారించి నూతన భవనం వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# పాఠశాలల్లో అడ్మిషన్ డ్రైవ్

## అధికారులకు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశం

**ప్రజాశక్తి-పార్వతీపురం**

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పాఠశాలల్లో అడ్మిషన్ డ్రైవ్ ప్రారంభించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్.. విద్యా శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో అడ్మిషన్లు, అంగన్వాడీ కేంద్రాలలో విద్యార్థుల విద్య, ఆరోగ్య స్థాయిలను గూర్చి కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సమీక్షించారు. ఇందులో భాగంగా అంగన్వాడీ కేంద్రాల్లో ఉంటున్న చిన్నారులు అందరూ ఒకటో తరగతిలో విధిగా చేర్చాలని ఆయన ఆదేశించారు. ఏ ఒక్క విద్యార్థి పాఠశాలలో చేరకుండా ఉండరాదని స్పష్టం చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో కాకుండా బయట ఉన్న చిన్నారులను సైతం గుర్తించి చేర్చాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఈ నెల 19న వీడ్కోలు కార్యక్రమం జరుగుతుందని, 21వ తేదీ నాటికి పిల్లలు అందరూ పాఠశాలల్లో ఉండాలని చెప్పారు. గత ఏడాది ఒకటో తరగతిలో 10,932 మంది చేరారని, దాదాపు అదే స్థాయిలో విద్యార్థులు ఈ ఏడాది చేరాలని ఆదేశించారు. ఏడో తరగతి నుండి 8వ తరగతి, 10వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ లేదా ఇతర కోర్సుల్లో చేరే విద్యార్థులపైనా దృష్టి సారించాలని తెలిపారు. జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 9,200 సీట్లు ఉన్నాయని వెల్లడించారు.

బడి బయట వివిధ కారణాల వల్ల ఉన్నవారి వివరాలు సంపూర్ణంగా సేకరించాలని, వారి విద్యా పరిస్థితులు తెలుసుకోవాలని కలెక్టర్.. అధికారులను ఆదేశించారు. పదో తరగతి పరీక్షలలో తప్పిన వారిని వెంటనే సప్లిమెంటరీ పరీక్షలకు పంపించాలని, ఇందుకు మండల విద్యా శాఖ అధికారులు బాధ్యత వహిస్తారని తెలిపారు. విద్యలో ఉన్నత అర్హతలున్న ఉపాధ్యాయులు ఉన్నారని చెప్పారు. పోటీ పరీక్షల్లో విజయం సాధించి ఉద్యోగాలు పొందారని, అదే స్ఫూర్తితో మంచి ప్రమాణాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**వయస్సుకు తగిన బరువు, పెరుగుదల ఉండాలి**

అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారుల బరువు పెరుగుదల వయస్సు తగిన విధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఏ అంగన్వాడీ కేంద్రంలోనైనా నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా చిన్నారుల బరువు, పెరుగుదల ఉండదో అందుకు సూపర్వైజర్లు బాధ్యత వహిస్తారని స్పష్టం చేశారు. బాగా పనిచేయని సూపర్వైజర్లు ఉండాలా? సస్పెండ్ చేయాలా? అనేది తేల్చుకోవాలని హెచ్చరించారు. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం తీసుకుంటున్నా సరైన వృద్ధి లేనప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాలని, సంబంధిత వైద్యాధికారులను సంప్రదించాలని ఆదేశించారు. గుమ్మ, సీతంపేట ప్రాంతంలో నిర్దేశిత ప్రమాణాలకు తగిన విధంగా చిన్నారుల పెరుగుదల, బరువు కనిపించడం లేదని, దీనిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అంగన్వాడీ చిన్నారులను పాఠశాలలో చేర్పించుటకు అవసరమైన ఆధార్ కార్డు నమోదును 15 రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. బాల్య వివాహాలు జరగరాదన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు మంజూరు చేసిన మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి కావాలని ఆదేశించారు.

**2 నెలల్లో జనన ధ్రువపత్రాలు**

శిశువు జన్మించిన రెండు నెలల్లో జనన ధ్రువీకరణ పత్రాలను పంచాయతీ కార్యదర్శి జారీ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎక్కడైనా జనన ధ్రువపత్రాలు జారీ కాకుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సంబంధిత పంచాయతీ కార్యదర్శులపై చర్యలు చేపడతామని చెప్పారు.

ఈ సందర్భంగా అంగన్వాడీ నిర్వహణ కరపత్రాలను జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారిత అధికారి టి.కనకదుర్గ, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి డి.మంజులవీణ, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారిత అధికారి ఎన్.కృష్ణవేణి, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎం.డి.గయాజుద్దీన్, జిల్లా బిసి సంక్షేమ సాధికారిత అధికారి ఇ.అప్పన్న, సమగ్ర శిక్ష ఎపిసి ఆర్.రాజేశ్వర రావు, సిడిపిఒలు, డిప్యూటీ డిఇఒలు, ఎంఇఒలు తదితరులు పాల్గొన్నారు.

### సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని

# మున్సిపల్ కార్మికుల ధర్నా

**ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్**

ధర్నా చేస్తున్న నాయకులు, మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ పారిశుధ్య పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించి, సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ బివి రమణ డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో 17 రోజుల సమ్మె కాలంలో కార్మికులకు ఇచ్చిన హామీలు నేటికీ అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. కాంట్రాక్టు కార్మికులకు రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, రిటైర్మెంట్ సమయంలో గ్రాడ్యుటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. పర్మినెంట్ కార్మికులకు పిఆర్‌సి అమలు చేయాలని, డిఎలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ పెద్దలు మున్సిపల్ కార్మికుల సేవలను కొనియాడుతూనే వారికి న్యాయబద్ధంగా ఇవ్వాల్సిన సదుపాయాలను కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు అవసరమైన గ్లౌజులు, సబ్బులు, చెప్పులు, పనిముట్లు, చెత్త సేకరణ బండ్లు నేటికీ పూర్తి స్థాయిలో సరఫరా చేయడం లేదని చెప్పారు. ఇప్పటికే రిటైరైన వారి స్థానంలో కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించాలని, అనారోగ్యానికి గురైన వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఆప్కోస్‌లో తప్పుగా నమోదైన వారి వయస్సు సవరించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం శానిటరీ ఇన్‌స్పెక్టర్ పకీర్‌రాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వి.ఇందిర, బి.సూరిబాబు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు నాగవంశం శంకరరావు, చీపురుపల్లి సింహాచలం, బంగారు రవి, గండేటి గంగరాజు, నాగవంశం మల్లేష్, నాగవంశం నిర్మల, మామిడి శివ, తదితరులు పాల్గొన్నారు.

## హిందీలో పోటీలు

**ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్**

హిందీ ప్రచార సభ హైదరాబాద్‌ను స్థాపించి 90 ఏళ్లు పూర్తయిన సందర్భంగా హైస్కూల్, కాలేజీ విద్యార్థులకు వేర్వేరుగా హిందీలో పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆ సభ ఉపాధ్యక్షులు డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.పార్థసారథి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి కోనే శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హిందీ వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, కథ-కవితా పఠనం పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జాతీయ సమైక్యతకు హిందీ ప్రాముఖ్యత అనే అంశంపై కనీసం మూడు పేజీలకు తగ్గకుండా హిందీ భాషలో వ్యాసం రాసి, ఈ నెల 20న పార్వతీపురంలోని హిందీ పండిట్స్ ట్రైనింగ్ కాలేజీలో ఇవ్వాలని తెలిపారు. వ్యాసం మొదటి పేజీలో పేరు, స్కూల్/కాలేజీ పేరు, చదువు, మొబైల్ నెంబర్ వివరాలను రాయాలని పేర్కొన్నారు. పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్లు, విజేతలకు బహుమతులు అందజేస్తారని చెప్పారు. వివరాలకు 76800 67532 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

# సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్

అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

**ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం**

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించడానికి ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు ప్రజల నుంచి విశేష స్పందన కనిపించింది. వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు వచ్చి తమ సమస్యలపై వినతులు అందజేశారు. ప్రతిఒక్కరి సమస్యను ఎమ్మెల్యే ఆలకించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ పాడి సుదర్శన్ రావు పాల్గొన్నారు.

**గృహనిర్మాణ అధికారులతో సమీక్ష**

ఇల్లు లేని నిరుపేదల జాబితా సేకరించి ప్రతిఒక్కరికీ మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అధికారులకు సూచించారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇల్లు మంజూరు, సకాలంలో బిల్లులు చెల్లింపులుపై ప్రత్యేక దృష్టిసారించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌టి సెల్ అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు, టిడిపి నాయకులు భారతి, కొండయ్య, గృహ నిర్మాణ శాఖ డిఇ ఎన్ వెంకట్రావు, ఎఇలు పాల్గొన్నారు.

**వారపుసంత సందర్శన**

గుమ్మలక్ష్మీపురం వారపు సంతను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సందర్శించారు. సంతకు వచ్చిన గిరిజనులతో, వ్యాపారస్తులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అంతా ఆన్‌లైన్ వ్యాపారాలు జరుగుతున్న తరుణంలో ఏజెన్సీ ప్రాంతాల్లో ఈ వారపు సంతలు జరగడం చాలా గొప్ప విషయమన్నారు. ఇలాంటి ప్రాంతాల్లో మాత్రమే స్వచ్ఛమైన గిరిజన అటవీ ఉత్పత్తులు దొరుకుతాయని అన్నారు.

## గిరిశిఖర గ్రామాల్లో బోర్ల నిర్మాణం

### 'ప్రజాశక్తి' కథనానికి స్పందన

**ప్రజాశక్తి - కురుపాం**

ఏర్పాటుచేసిన బోరును పరిశీలిస్తున్న ఎంపిడిఒ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ

'గుక్కెడు నీటికి గంపెడు కష్టాలు' అనే శీర్షికతో ప్రజాశక్తిలో ఇటీవల ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ ఆర్.వేణుగోపాల్ బుధవారం మండలంలో వలసబల్లేరు పంచాయతీలో గిరిశిఖర గ్రామాలైన ఆగంగూడ, చాపరాయిగూడను సందర్శించారు. అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను తెలుసుకున్నారు. అనంతరం ఆగంగూడ గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో బోరును తవ్వించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి ప్రతి గిరిశిఖర గ్రామంలో బోర్లు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించామన్నారు.

# తాగునీటిపై దృష్టిసారించండి

సీతంపేటలో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిజిపిఒ కొండలరావు

**ప్రజాశక్తి-సీతంపేట**

తాగునీటి సమస్యపై దృష్టి సారించాలని జిల్లా గ్రామీణ పంచాయతీ అధికారి టి.కొండలరావు.. కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పిఆర్ వన్ యాప్, తాగునీరు, పారిశుధ్యం, ఇంటి పన్నుల వసూలుపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ విషయంలో తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం సీతంపేట చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. వర్మీ కంపోస్ట్ తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఒ కె.రాంప్రసాద్, డిపిఆర్‌సి సిబ్బంది, డిప్యూటీ ఎంపిడిఒ కె.సత్యం, పంచాయతీ కార్యదర్శులు రామకృష్ణ, పాపారావు, వినోద్, శ్యామ్, అప్పలసూరి, రాజశేఖర్, రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

**సంపద కేంద్రాన్ని సందర్శించిన డిజిపిఒ**

**వీరఘట్టం** : మండల కేంద్రంలోని చెత్త సంపద కేంద్రాన్ని డిజిపిఒ టి.కొండలరావు సందర్శించారు. తడి, పొడి చెత్తలు సేకరించి, వాటి ద్వారా సంపద సృష్టించేందుకు బాధ్యత వహించాలని మేజర్ పంచాయతీ ఇఒ కోటేశ్వరరావును ఆదేశించారు. సంపద ద్వారా వచ్చే ఆదాయం పంచాయతీ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బి.వెంకటరమణ, ఇఒపిఆర్‌డి టి.వెంకట రమణ మూర్తి నాయుడు, మేజర్ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

## గాయపడిన మహిళ మృతి

**ప్రజాశక్తి - గరుగుబిల్లి**

మండలంలోని రావివలస జంక్షన్ వద్ద మంగళవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ ఎస్.కొండమ్మ బుధవారం మృతిచెందింది. తీవ్రంగా గాయపడిన ఆమెను పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి, అక్కడి నుంచి విజయనగరం తరలించారు. అయినా పరిస్థితి విషమించి ఆమె మృతిచెందింది. కొండమ్మ తండ్రి పైడిరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సి ఈశ్వరరావు తెలిపారు.

## 220 లీటర్ల సారా స్వాధీనం

**ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్**

మండలంలోని ఆర్‌కె బట్టివలస గ్రామ సరిహద్దులో బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో బాలగుడబ గ్రామానికి చెందిన బంగారి వెంకటరమణ 220 లీటర్ల నాటు సారాతో పట్టుబడ్డాడు. వాహనాన్ని సీజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేశారు. ఇదే కేసులో ఒడిశాలోని చీడివలసకు చెందిన రత్నాల రమేశ్‌ను జతపరచామని సిఐ సింహాద్రి తెలిపారు.

## వారపు సంతలో వైద్య శిబిరం

**ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం**

గుమ్మలక్ష్మీపురం వారపు సంతలో బుధవారం యూనిక్ ఆస్పత్రి ఆధ్వర్యాన మెగా వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ప్రారంభించారు. వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఎమ్మెల్యే జగదీశ్వరి బిపి, షుగర్ పరీక్షలు చేయించుకున్నారు. ప్రజలకు వైద్యులు పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, కలిసేటి కొండయ్య, నాయకులు కోలా రంజిత్ కుమార్, వెంపటాపు భారతి, వైద్యులు భవాని, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

# ప్రభుత్వ బడిలో చేర్పిద్దాం

### యుటిఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన

**ప్రజాశక్తి-వీరఘట్టం**

ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని యుటిఎఫ్ నాయకులు బుధవారం మండలంలోని విక్రంపురంలో ప్రచారం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ బడిలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.కవిత, యుటిఎఫ్ నాయకులు ఎం.పైడిరాజు, కె.గోవింద రావు, బి.దుర్గాప్రసాద్, జెవి సూర్యప్రకాశ్, కె.సింహాచలం, ఎం.ముకుందరావు, ఎస్.గణేష్ పాల్గొన్నారు.

## పిహెచ్‌సిని సందర్శించిన డిఎంహెచ్‌ఒ

**ప్రజాశక్తి-సీతానగరం**

రికార్డులను పరిశీలిస్తున్న డిఎంహెచ్‌ఒ భాస్కరరావు

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం.భాస్కరరావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సిసిడి, లెప్రసీ సర్వేలు వేగవంతం చేయాలన్నారు. ఆసుపత్రి రికార్డులను తనిఖీలు చేశారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి పి.ఉషారాణి, హెచ్‌విడి సత్యవతి, సిఇఒ వెంకటరావు, సూపర్వైజర్ శర్మ, యుడిసి మురళి తదితరులు పాల్గొన్నారు.